క్లుప్తంగా

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని గోపాలపురం గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సహిత ధ్వజ, విగ్రహ, శిఖర ప్రతిష్ట సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం విగ్రహ ప్రతిష్ట అనంతరం ఉదయం 8 గంటల నుంచి బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇందులో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతిగా రూ.40,116, రెండవ బహుమతి రూ.30,116, మూడవ బహుమతి రూ. 20,116, నాల్గవ బహుమతి రూ.15,116, ఐదవ బహుమతి 10,116, ఆరవ బహుమతి రూ.5,116 అందజేస్తామన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : మండలంలోని ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ శేషా చలపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం వార్డు-1 సచివాలయం పరిధిలో బీసీ-జనరల్‌కు, కమలాపురం-3వ వార్డు సచివాలయంలో ఓసీ జనరల్‌కు, సంబటూరు సచివాలయం పరిధిలోని సి.గోపులాపురం పంచాయతీ పరిధిలో బీసీ-జనరల్ అభ్యర్థులకు కేటాయించారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎస్ఎస్‌సీ పాసై ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఈనెల 30వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన అన్నారు.

ధ్యానం వల్ల ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి



మాట్లాడుతున్న శ్రీసత్సదానంద గిరిస్వామి

లింగాల : ధ్యానం వల్ల ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని ధ్యానరత్న శ్రీసత్సదానందగిరి అన్నారు. బుధవారం మండల పరిధి తాతిరెడ్డిపల్లె గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ధ్యాన కేంద్రంలో ఆయన ఆత్మజ్ఞాన ధ్యాన శిక్షణలు నిర్వహించారు. కార్యక్రమంలో ధ్యానరత్నలు వెల్లపూడి లక్ష్మణరావు, రామసుబ్బారెడ్డి, రఘునాథరెడ్డి, కృష్ణమోహన్, తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, వెలిదండ్ల తదితర గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ట



వేడుకలో వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని బొగ్గుడుపల్లె గ్రామంలో శ్రీగంగమ్మతల్లి ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మండల నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గుడుపల్లె గ్రామంలో ప్రభుత్వం పాడా నిధులతో సుందరంగా నిర్మించిన గంగమ్మ ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌ను బుధవారం కడప డీఎస్పీ బీవీ శివారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ అశోక్‌రెడ్డి, ఎస్.అరుణ్‌రెడ్డిలకు సూచించారు. పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఆయన పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంతోషం

- పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయం
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటా సంతోషం కలిగిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. వేంపల్లె మండలం కత్తలూరు, మిట్టపల్లె గ్రామాల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ముందుగా ఆ గ్రామంలో ప్రతి ఇంటా మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికి అనంతరం శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడున్నర కాలంలో సంక్షేమం, అభివృద్ధి పథకాల ద్వారా పేదల జీవితాలలో వెలుగులు నింపాయన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెరుగైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కర పత్రాలు అందించారు. ముఖ్యంగా ఆ గ్రామాల్లో తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ పింఛన్లు, ఇళ్లు, డీకేటీ, వ్యవసాయ భూములు తదితర సమస్యలను ఆ గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఆయన స్పందిస్తూ ఆయా శాఖల అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, హజ్‌హౌస్ కమిటీ డైరెక్టర్ మునీర్, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, విద్యుత్ డీఈఈ శ్రీకాంత్, వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి రెడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ రెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమరెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఏపీఓ చంద్రశేఖర్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్, ఎంపీటీసీ కళ్యాణి, సర్పంచ్ పావని, మాజీ సర్పంచ్ ఆర్‌ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, నాగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఉత్తయ్య, కృష్ణయ్య, విశ్వనాథ్, గంగన్న, నాగసుబ్బయ్య, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పురాతన ఆలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- దేవాదాయ శాఖ నిధులతో జీర్ణోద్ధరణ పనులు
- ఆలయ భూమి పూజలో వైఎస్ భాస్కర్‌రెడ్డి

వేముల : గ్రామీణ ప్రాంతాలలోని పురాతన ఆలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దేవాదాయ శాఖ నిధులతో జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మీదిపెంట్ల కోట సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్ల దేవదాయ శాఖ నిధులను మంజూరు చేసింది. దీంతో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డిలతో కలిసి ఆయన ఆలయ జీర్ణోద్ధరణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లోని పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. జీర్ణోద్ధరణ పనులు పూర్తై గ్రామాల్లో ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయన్నారు. గ్రామాల్లో ఆలయాలను నిర్మించుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఆలయాలలో దూప, దీప, నైవేద్యానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆలయాల నిర్మాణంలో దేవాదాయ శాఖ డీఈ గంగయ్య ప్రత్యేక చొరవ చూపుతున్నారని ప్రశంసించారు. అలాగే గ్రామంలో ఆలయ నిర్మాణానికి రూ.1.20కోట్ల నిధులు మంజూరు చేయడంపట్ల కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమయ్య, మాజీ సర్పంచ్‌లు శ్రీరామిరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంజేపీఏపీ విద్యార్థులు ఎంపిక

వేంపల్లె : జిల్లాస్థాయి క్రీడా పోటీలలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ హరిత తెలిపారు. బుధవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించి మాట్లాడారు. ఇటీవల నందలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, చెస్, షటిల్, పరుగు పందెం పోటీలలో తమ పాఠశాలకు చెందిన చంద్రకళ, శ్రీలత, వర్ష, సునీత, అమృత, మేఘన, పార్వతి, గీత, హర్షిణిలు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగాల ఉషారాణి రూ.20వేల ప్రోత్సాహక నగదును అందించారని.. ఈ మొత్తంలో ఆట వస్తువుల కొనుగోలు, విద్యార్థుల రవాణా ఖర్చులకు వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ హరిత, తదితరులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు

చెన్నూరు : రామనపల్లిలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో మహాగణపతి సుబ్రమణ్య విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను బుధవారం ఆలయ కమిటీ వారు నిర్వహించారు. ఆలయంలో జరిగిన ఈ పూజల్లో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమాలలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారన్నారు. అనంతరం 12 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో దేవగుడి భాస్కర్‌రెడ్డి, మడక వెంకటసుబ్బయ్య, మీగడ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, దేవిరెడ్డి రమారెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు సంపత్‌కుమార్, గరుడాద్రి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చక్కటి ప్రణాళికతో లక్ష్యసాధన సాధ్యం

వైవీయూ : విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు చక్కటి ప్రణాళికతో సన్నద్ధం కావాలని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన స్టెప్ సీఈఓ మాట్లాడుతూ యువత చదువుకునే సమయంలోనే ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాకారం కోసం శ్రమించాలని సూచించారు. అనంతరం ఏపీ యువ జన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కెరీర్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాన్ని ఆవిష్కరించి, విద్యార్థినులకు అందజేశారు.

నేటి నుంచి ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధం

జమ్మలమడుగు : రిపబ్లిక్ డే నుంచి మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలు కనిపిస్తే అడుగుకు వంద రూపాయలు చొప్పున జరిమానా విధిస్తామన్నారు. ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు.

ఏర్పాట్లు సిద్ధం

కమలాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఆయా కార్యాలయాల అధికారులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్ మువ్వన్నెల జెండా ఎగుర వేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

శనగపంట కోత ప్రయోగం

కొండాపురం : రబీ సీజన్‌లో సాగు చేసిన బుడ్డశనగ పొలంలో పంట కోత ప్రయోగం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం మండలంలోని ఉప్పికాయలపల్లె, యర్రగుడి, తాళ్లప్రొద్దుటూరు గ్రామాల్లో శనగ పంట దిగుబడిపై పంట కోత ప్రయోగాలు వ్యవసాయ అధికారి, బీమా అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జి.రామలక్షుమ్మ సర్వేనెంబర్ 249/2 పొలంలో 5×5 మీటర్లలో పంటకోత ప్రయోగం నిర్వహించగా దిగుబడి 1.880 గ్రాములు అలాగే జి.భవాని శనగపంట పొలంలో(సర్వేనెంబర్ 25/3) లో 5×5 మీటర్లలో పంటకోత ప్రయోగం చేయగా దిగుబడి 2.620 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాకులు పాల్గొన్నారు.



శనగపంట పొలంలో కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షే పథకాలను అమలు చేస్తున్నారని వాటి ద్వారా పేదలకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. 19వ వార్డులోని నడిమూరులో ఆయన బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వారికి బ్రోచర్లను అందజేశారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించిన ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అందించి వారి కుటుంబాల్లో ఆనందం నింపారన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించి వారి కుటుంబాల్లో వెలుగు నింపారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి ఎం. సురేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, ఎస్ఐ వెంకటకృష్ణయ్య, విద్యుత్‌శాఖ ఏఈ సుబ్బారావు, హౌసింగ్ డీఈ విజయబాబు, ఏఈ శ్రీనివాసులు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బాలనారాయణరెడ్డి, ఉమమహేశ్వరీ, కేవీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, జెక్కు చెన్నక్రిష్టారెడ్డి, యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సూభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

రోడ్డు విస్తరణకు పుర ప్రజలు సహకరించాలి

పులివెందుల టౌన్ : పులివెందుల మోడల్ టౌన్ అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న రోడ్ల విస్తరణకు పురపాలక ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరపరసాద్‌లు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ చేయాల్సి ఉండటంతో 80 అడుగుల వెడల్పుతో విస్తరణ చేస్తున్నారని.. దీనికి సంబంధించి విజయ్ హోమ్స్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు, అక్కడ నుంచి అంబకపల్లె రోడ్డు వరకు, గాంధీ సర్కిల్ నుంచి ఉలిమెల్ల రోడ్డు, పార్నపల్లె రోడ్డు నుంచి రాజీవ్ కాలనీ రోడ్డు వరకు, గాంధీ సర్కిల్ నుంచి మార్కెట్ యార్డు, అలాగే ముద్దనూరు రోడ్డు కూడా విస్తరణ జరుగుతుందన్నారు. అంతేకాక 44 అడుగులతో శ్రీరామా హాలు రోడ్డు కూడా విస్తరణ జరుగుతుందన్నారు. ఈ విస్తరణలో భాగంగా ఇళ్లు, స్థలాలను కోల్పోయే నిర్వాసితులు ఎంత త్వరగా డాక్యుమెంట్లను అధికారులకు ఇవ్వడంతో వ్యాల్యూను బట్టి అమౌంట్‌ను త్వరగా అందిస్తారన్నారు. ప్రజలు కూడా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సహాయ సహకారాలు అందించాలన్నారు. కౌన్సిలర్లు కూడా ప్రతి రోజు ఒక గంట మీ వార్డులలో పర్యటించాలన్నారు. ఇటీవల మన ముఖ్యమంత్రి జీటీఎస్‌ను పులివెందులలో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేయాలని.. అలా వేరు చేయకుండా చెత్త బండిలో వేస్తే జీటీఎస్‌లో దాన్ని వేసేందుకు సమయం చాలా పడుతుందన్నారు. కౌన్సిలర్లు మీ సచివాలయ శానిటేషన్‌సిబ్బందితో కలిసి మీరు, మీ వార్డులలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, కొండప్రావు, సుజాత, శైలజ, మహేశ్వరరెడ్డి, ఖాదర్ బాషా, కో ఆప్షన్ చంద్రమౌళి, రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్.. పక్కన మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

కోవరంగుంటపల్లెలో సినిమా షూటింగ్

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె గ్రామంలో వీసీ క్రియేషన్స్ నిర్మాణ సారథ్యంలో పద్మవ్యూహం చక్రధారికే తెలుసు అనే తెలుగు సినిమాకు బుధవారం వైఎస్సార్‌సీపీ రైతు సంఘ రాష్ట్ర నాయకుడు దిన్నెపాడు రవిరాజు క్లాప్ కొట్టి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో సినిమా సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ చిత్రానికి డైరెక్టర్‌గా సంజయ్‌రెడ్డి వ్యవహరిస్తుండగా.. హీరో హీరోయిన్లుగా డాక్టర్ ప్రవీణ్, అనుషీతల్‌లు నటిస్తున్నారు.



సినిమాకు క్లాప్ కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రవిరాజు, తదితరులు

నేడు విగ్రహ ప్రతిష్ట



అభయాంజనేయస్వామి విగ్రహం

లింగాల : మండల పరిధిలోని వెలిదడ్ల గ్రామ సమీపంలోని తిమ్మంపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయం, అభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయ నిర్వాహకులు ఆలయంలో తదితర పూజలను వేద పండితులచే నిర్వహించారు. గురువారం ఉదయం మహాన్నపనం, మంత్ర ప్రతిష్ట, బింబ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, బలిహరణం, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం ఉదయం తాతిరెడ్డిపల్లె, నేర్జాంపల్లె, లింగాల, వెంకటాంపల్లె గ్రామాల చెక్క భజన బృందాలచే చెక్క భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు : స్థానిక ఆర్టీసీ కార్యాలయ డిపో మేనేజర్‌గా వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డిపో మేనేజర్‌గా పనిచేసిన రామసుబ్బయ్యపై అవినీతి ఆరోపణలు రావడంతో అతనిని సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టడంతో ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ నాయకులు మేనేజర్‌ను కలిసి సన్మానించారు.

ఓటు హక్కు వజ్రాయుధం లాంటింది

కమలాపురం : ఓటు ఆయుధం కంటే గొప్పదని, ఓటు వజ్రాయుధం అని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందాలని కమలాపురం మండల తహసీల్దార్ అమరేశ్వరీ తెలిపారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని వేడుకలా నిర్వహించారు. చదిపిరాళ్ల పోలింగ్ స్టేషన్‌లో నిర్వహించిన వేడుకలో ఆమె పాల్గొని సీనియర్ ఓటర్లను సన్మానించారు. రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : స్థానిక హైస్కూల్ విద్యార్థులచే పెండ్లిమర్రిలో ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు మాట్లాడారు. ఎంఈఓ సుజాత, సర్పంచ్ నాగమల్లారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అంజనాగౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : లింగారెడ్డిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో సీనియర్ ఓటర్లను మండల ఉపాధ్యాక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలగంగిరెడ్డి, సర్పంచ్ సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ఓటరుకు ఆధార్ సీడింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మండల బూత్ లెవెల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీఓ వెంకటేశులు హాజరై ఓటు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అలాగే సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో డీటీ ఆయూబ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సీనియర్ సిటిజెన్లను తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రహమతుల్లా, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, కొత్త ఓటర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రాగాం అధికారి ఓబుళరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే వేంపల్లె మండలం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్-3, 14, 15 విభాగాల ప్రొగ్రాం అధికారులు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సీనియర్ సిటిజన్ రిటైర్డ్ తహసీల్దార్ నజీర్ అహమ్మద్, పెన్షనర్స్ ఆసోసియేషన్ అధ్యక్షుడు దేవదానంతో పాటు మరికొందరికి సన్మానం చేశారు.

లింగాల : మండల పరిధిలోని పెద్దకుడాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామకృష్ణయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎస్‌పీఎల్ ఎన్నికలను నిర్వహించారు.



పులివెందులలో సీనియర్ సిటిజెన్‌ను సత్కరిస్తున్న ఆర్డీఓ వెంకటేశులు



కమలాపురం సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ అమరేశ్వరీ



జమ్మలమడుగులో సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు